క్లుప్తంగా

ఆసరా పింఛన్లు అందించాలి



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: ఆసరా పింఛన్లు అందక జిల్లాలోని లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ సిరిసిల్ల కార్యదర్శి పంతం రవి అన్నారు. సోమవారం సిరిసిల్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు అందించాలని, లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు అజ్జ వేణు, కొంక విజయ్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

వేములవాడఅర్బన్: ఈనెల 3,4వ తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన ఇండో, నేపాల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వేములవాడ ఓకినవా స్పోర్ట్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరాటే కోచ్ అబ్దుల్ మన్నాన్ తెలిపారు. విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందించారు.

యాసంగి సాగుకు నీరు విడుదల చేయాలి

ముస్తాబాద్: యాసంగిలో సాగుకు పూర్తిస్థాయిలో నీరందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. సోమవారం రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు అంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ యాసంగిలో మండలంలో ఇరవై వేల ఎకరాలకు పైగా వరినాట్లు వేశారన్నారు. ఇప్పుడే భూగర్భ జలాలు అడుగంటి బోర్లు నడవడం లేదన్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టులోని నీటిని రంగనాయకసాగర్‌కు తరలించి, అక్కడి నుంచి ముస్తాబాద్ మండలానికి నీరందించాలన్నారు. బాల్‌రాజు, గోవర్ధన్‌రావు, సుభాష్, రాజేశం, దేవయ్య తదితరులున్నారు.

'గోరుముద్ద'కు విరాళం

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలోని ఉన్నత పాఠశాలలో పది విద్యార్థుల కోసం అమలు చేస్తున్న గోరుముద్ద కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి రూ.5వేలు, ఉప్పుల ఆంజనేయులు రూ.3 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ విజయ్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం



సన్మానిస్తున్న రెడ్డిసంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మండలంలోని నారాయణపూర్ మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మిని సోమవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. లక్ష్మితో పాటు వార్డు సభ్యుడు మోతె పర్శరాంరెడ్డిని ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు నిమ్మ మల్లారెడ్డి, సభ్యులు మల్లారెడ్డి, రాజిరెడ్డి, దేవిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

ఆలయ రాజగోపురం నిర్మాణానికి పచ్చజెండా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పచ్చజెండా ఊపారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు రాజగోపురం నిర్మాణానికి మంజూరుపత్రం అందజేశారు. అర్చకులు పెరంబదూర్ సత్యనారాయణ ఆచార్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవార్డు అందజేత

బోయినపల్లి (చొప్పదండి): బీఎస్పీలో క్రియాశీలకంగా పనిచేసే వారికి ఇచ్చే కాన్షీరాం సేవాపథకంలో బీఎస్పీ ఉత్తమ వర్కర్‌గా మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన కొంకటి శేఖర్ ఎంపికయ్యాడు. చొప్పదండి నియోజకవర్గంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్న శేఖర్‌ను రాష్ట్ర బీఎస్పీ చీఫ్ ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

నిధులు మంజూరు

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్లతండాలో సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ తెలిపారు. నిధుల మంజూరుపై హర్షంవ్యక్తం చేస్తూ తండాలో ప్రధానరి మోదీ, ఎంపీ బండిసంజయ్ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు.

రేపు థాణా దివస్

ముస్తాబాద్: ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం థాణా దివస్ నిర్వహించనున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మండలంలోని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు.

ఆరుబయటే డంపింగ్



చందుర్తిలో ఆరుబయట పారబోసిన చెత్త



చెత్త తగులబెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

- సేకరించిన చెత్తకు ఆరుబయట నిప్పు
- నిరుపయోగంగా వర్మీకంపోస్ట్ షెడ్లు
- పొగతో అనారోగ్యం బారినపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చందుర్తి : ఇంటింటా సేకరించిన చెత్తనుంచి సేంద్రీయ ఎరువు తయారు చేయాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను ఆరుబయటే పారబోస్తూ నిప్పుపెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంబారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు జీపీలకు ఆదాయం పెంచాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ షెడ్‌లు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్మాణానికి రూ.2.50లక్షలు ఖర్చుచేశారు. కాగా ఎరువుల తయారీ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చెత్తకు నిప్పు పెడుతున్నారు. జీపీ సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి షెడ్‌కు తరలించాలన్న ఆదేశాలు ఉన్నా వాటిని ఎక్కడ అమలు చేసిన దాఖలాలు లేవు.

అంతా ఒకేచోట

గ్రామాల్లో సేకరించిన చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ వస్తువులు, కూరగాయలు, ఇతర వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువులు తయారు చేయాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది ఆరుబయట పారబోస్తూ తగులబెడుతున్నారు. చందుర్తి గ్రామ పొలిమేరలోని పశు వైద్యశాల సమీపంలో చెత్తను పారబోస్తూ నిప్పుపెట్టడంతోపొగ, దుర్వాసనను భరించలేకపోతున్నామని, ఆరునెలలుగా అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని జీపీ పరిధిలోని 3వ, 7వ వార్డు ప్రజలు వాపోతున్నారు.

వాహనదారుల ఇబ్బంది

ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన కంపోస్టు షెడ్ల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని చాలా గ్రామాల్లో సేకరించిన చెత్తను ఆరు బయట పోరబోస్తూ తగలబెడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా వేస్తూ నిప్పంటిస్తున్నారు. పొగతో దారి సక్రమంగా కనిపంచక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంపోస్ట్‌షెడ్లు నిర్మించిన తొలుత చూపించిన ఆసక్తిని ప్రస్తుతం అధికారులు చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

పొగ వ్యాపిస్తోంది



గ్రామంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇళ్ల సమీపంలో పారబోస్తున్నారు. తరచూ చెత్తకు నిప్పు పెడుతుండటంతో పొగ మొత్తం వ్యాపిస్తోంది. దీంతో ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారుతోంది. వ్యర్థాలనుంచి వచ్చే వాసనతో పాటు దోమలు వృద్ధిచెందుతుండటంతో అనారోగ్యం బారినపడుతున్నాం.

– లక్కర్సు శశి, 3వ వార్డు, చందుర్తి

పట్టించుకోవడం లేదు



చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఇళ్లలో పొగ వ్యాపిస్తోంది. ఉదయం పూట మహిళలు ఇంటిపనులు చేయడకష్టంగా ఉందని ఆరునెలల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలిపాం. చెత్తను కంపోస్ట్ షెడ్, డంపింగ్ యార్డ్‌కు తరలించాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు దృష్టిసారించాలి.

– లింగాల వెంకటేశ్, 3వ వార్డు, చందుర్తి

చర్యలు తీసుకుంటాం



గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని గతంలో ఆదేశాలు జారీచేశాం. తనిఖీలు కూడా చేపట్టాం. అయినా ఆరు బయట పారబోస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. మరోసారి కార్యదర్శులతో సమావేశం నిర్వహించి కంపోస్ట్‌షెడ్లు, డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

– పత్తి రవీందర్, ఎంపీడీవో, చందుర్తి

పేదల సంక్షేమానికి పెద్దపీట



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- మేనిఫెస్టోలోని హామీలు అమలు చేస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రాజన్న ఆలయం, పట్టణాభివృద్ధి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చందుర్తి : లింగంపేటలో మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని మహాలింగేశ్వరగార్డెన్‌లో సోమవారం వేములవాడ పట్టణం, అర్బన్ మండలాలకు చెందిన 77 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలోని ప్రతీ అంశాన్ని అమలు చేసి చూపిస్తామన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలవుతున్నాయని, మరో వారం రోజుల్లో రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలవుతాయని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం, వేములవాడ పట్టణాల అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. గతంలో మంజూరైన రూ.30కోట్లలో రూ.20కోట్లు వెనక్కి వెళ్తే సీఎంతో మాట్లాడి తెచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజన్న ఆలయం ఎదుట రోడ్ల విస్తరణ, మూలవాగు బ్రిడ్జి నిర్మాణం, శివార్చన వేదిక, గుడి చెరువు బండ్ నిర్మాణం పనులు పూర్తవుతాయన్నారు. గుడి చెరువు, మూలవాగుల ప్రక్షాళన చేసేందుకు ఎస్టీఎఫ్ నిధుల మంజూరుకు ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. మర్రిపల్లి రిజర్వాయర్ పూర్తికి కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ మహేశ్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచకు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు మారం రాములు, మాజీ ఉపసర్పంచ్ రౌతు చంద్రయ్యతోపాటు సుమారు 50 మంది సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. అర్బన్ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, గంధం రాములు, పెద్దల కనకయ్య, రాగళ్ల కరుణాకర్, బొంగోని రమేష్, బొంగుని పద్మ, నర్మెట్ల రాములు, మైలారం నాగరాజు ఉన్నారు.

పరామర్శ

వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీకి చెందిన యువకుడు మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌన్సిలర్ బింగి మహేశ్, కనికరపు రాకేశ్, సందీప్, తదితరులున్నారు.

మీ అందరి రుణం తీర్చుకుంటా

చందుర్తి(వేములవాడ): నా గెలుపు కోసం మీరందరూ కష్టపడి పనిచేశారని.. మీ రుణం తీర్చుకుంటానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం లింగంపేట, కిష్టంపేట, రామరావుపేటల్లో సోమవారం నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీటీసీ మ్యాకల గణేశ్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు బండారి శేఖర్, బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య, గొట్టే ప్రభాకర్, దారం చంద్రం పాల్గొన్నారు.

ఇంటింటా పథకాలు అందించాలి



వేములవాడ రూరల్: మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

ముస్తాబాద్: బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గావ్ చలో బస్తీ చలో అభియాన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా పనిచేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గజభీంకార్ చందు, మండల శాఖ అధ్యక్షుడు అంజాగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, సొల్ల క్రాంతి, సంజీవ్, గిరిధర్‌రెడ్డి, మెంగని మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ రూరల్ మండల ముఖ్య కార్యకర్తలతో మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. గావ్ చలో బస్తీ చలో అభియాన్‌లో భాగంగా ప్రవసి కార్యకర్తలను నియమించినట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి రవికిషోర్, వివిధ మోర్చాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



నగదు అందిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): అప్పులబాధతో సెంట్రింట్ కార్మికుడు ఆత్మహత్య చేసుకోగా పలువురు దాతలు బాధిత కుటుంబానికి చేయూతనందించారు. మండలంలోని ఆవునూర్ కు చెందిన బత్తుల రాజు సెంట్రింగ్ పనిచేస్తున్నా డు. అప్పులబాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సింధూర, ఏడేళ్ల కుమారుడు, ఐదేళ్ల కూతురు ఉన్నారు. బీజేపీ నాయకుడు సొల్ల క్రాంతికుమార్ కుటుంబ ఆర్థికపరిస్థితిపై సామాజిక మాధ్యమంలో పోస్ట్‌చేశారు. దాతలసాయంతో రూ.1లక్షా ఆరువేలు జమచేయగా సోమవారం మృతుడి భార్యకు జెడ్పీటీసీ గుండం నర్సయ్య అందించారు.

'బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకో..'



ఎల్లారెడ్డిపేట: సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టారీతిగా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పిచ్చి కుక్క లాగ మాట్లాడడం ఆపకపోతే కాంగ్రెస్ నాయకులు చెప్పు తెగేదాకా కొడతారన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పందిరి లింగంగౌడ్, చెన్ని బాబు, రామచంద్రం, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కొత్తపెల్లి దేవయ్య, గంట అంజయ్య, రఫీక్, బుచ్చయ్యగౌడ్, రాంరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై ఫిర్యాదు

గంభీరావుపేట: మండలకేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు రాజుగౌడ్, రాంచంద్రారెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

విజయవంతం చేయాలి

ముస్తాబాద్: ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. మహాసభల పోస్టర్‌ను జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, హెచ్‌ఎం రవీందర్, ప్రభాకర్ రెడ్డి, రాజు, చంద్రం, రాజ్‌మహ్మద్, శంకరయ్య, రమణ, జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : ఈనెల 11,12వ తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మండల అధ్యక్షుడు వై.మహేశ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. మర్రిగడ్డ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను మండల నోడల్ అధికారి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, కృష్ణ, చైతన్య, శ్రీనివాస్, రవి, మధుసూదన్, బాలకిషన్, లచ్చిరెడ్డి, గంగనర్సయ్య తదతరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం, చౌడాలమ్మ ఆలయం వద్ద రూ.2లక్షలు మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటారును సోమవారం ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు కుర్మ రాజయ్య, బాలయ్య, పెంటల కనకయ్య, బోటుక ఎల్లం, రేగుల శ్రీనివాస్, కొమురయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్లకల్చరల్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మైనార్టీ విద్యాసంస్థల విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఉమ్మడి కరీంనగర్‌లోని టీఎన్‌జీవో భవనంలో కొత్త విభాగానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుపతి, ఉపాధ్యక్షుడిగా పోతు సతీశ్, బి.గోపి, స్వామి, సంధ్యారాణి, కోశాధికారిగా కె.రాజు, జనరల్ సెక్రెటరీగా డి.రాకేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుమార్, జావేద్, రాంబాబు, మహేశ్ పరిశీలకులుగా వ్యవహరించారు.

బాధ్యతల స్వీకరణ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)గా ఆరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకముందు పనిచేసిన ఎంపీవో వెంకటేశ్వర్లు దీర్ఘకాలిక సెలవులో ఉండగా ఆయన స్థానంలో సూపరింటెండెంట్ విజయేందర్ రెడ్డి ఇన్‌చార్జి ఎంపీవోగా కొనసాగారు. విజయేందర్ రెడ్డిని ఇన్‌చార్జి విధుల నుంచి రిలీవ్‌చేస్తూ ఆరీఫ్ బాధ్యతలు చేపట్టారు. కాగా ముస్తాబాద్‌తోపాటు తంగళ్లపల్లి రెండు మండలాలకు ఆయన ఎంపీవోగా కొనసాగనున్నారు.

ధర్నాలు.. నిరసనలు

సిరిసిల్లటౌన్: పలు సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు.. నిరసనలతో సిరిసిల్ల జిల్లా కేంద్రం హోరెత్తింది. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై బీఆర్‌ఎస్ నేతలు అంబేద్కర్ చౌక్‌లో మహాధర్నా చేపట్టారు. ప్రభుత్వ తీరుపై పాత బస్టాండ్‌లో ఏబీవీపీ విద్యార్థులు, కలెక్టరేట్ ముందు సమస్యల పరిష్కారం కోరుతూ..కార్మికసంఘాలు నిరసనలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నినాదాలు.. నిరసనలతో సిరిసిల్ల పట్టణం దద్దరిల్లింది.



భువనగిరి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

భువనగిరిలో హాస్టల్ వార్డెన్‌ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలో ధర్నా చేపట్టగా పాల్గొని మాట్లాడారు. గురుకులాలు, కేజీబీవీల్లో జరగుతున్న అరాచకాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నాగరాజు, రాజు, అమర్నాథ్, పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సోమవారం సాయంత్రం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు మహాధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగానే తెలంగాణ సాధించిన కేసీఆర్ కాలిగోటికి సీఎం రేవంత్‌రెడ్డి సరిపోరని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రెండునెలలు కాలయాపన చేశారని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతారన్నారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరుపక్షాల మధ్య తోపులాట జరిగింది. మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. జీపీ కార్మికులతో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఇప్పుడు పాలకవర్గాల గడువు ముగిసిందని, జీతాలు అందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారన్నారు. కలెక్టర్ చొరవ చూపి వెంటనే జీతాలు ఇప్పించాలని, రక్షణ పరకరాలు, ఉపకరణాలు అందించాలని వినతిపత్రం అందించారు. కోడం రమణ, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, వర్కోలు బుర్ర శ్రీనివాస్, తదితరులున్నారు

కార్మికులకు కనీస వేతనాలు అందించండి

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌ను ముట్టడించారు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలన్నారు. పీఆర్సీ బకాయిలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నాయకులు ఎల్లారెడ్డి, కోడం రమణ పాల్గొన్నారు.

పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

గంభీరావుపేటలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే పంపిణీ చేయాలని బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో తాత్సారం వద్దని నిరసనతో కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. మొత్తం 272 డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో 234 పంపిణీ చేశారన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



వేములవాడ: మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 1012 రోజులుగా అన్నదానం చేస్తున్నారు. తనవంతు సాయంగా వేములవాడకు చెందిన డాక్టర్ పాదలకూరు లీలా శిరీష రూ. 10వేలు విరాళంగా ట్రస్ట్ ప్రతినిధులు మధు మహేశ్, రవికుమార్‌కు అందించారు.

విద్యార్థులు పది జీపీఏ సాధించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదో తరగతిలో విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని పూర్వ విద్యార్థులు కాశోజీ నారాయణ, కొమిరిశెట్టి శ్రీనివాస్, జ్యోతి అన్నారు. రాచర్ల బొప్పాపూర్, అల్మాస్‌పూర్ కేజీబీవీల్లో 1996–1997 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు పది విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

విరాళం అందజేత

కోనరావుపేట: కొలనూర్‌లో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శ్రీ కృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో రూ.51,016 అందజేశారు. సంకినేని వేణుమాదవరావు రూ.10వేలు అందించారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునఃప్రతిష్ఠ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దాతల సహకారాన్ని కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899